కథ

# అవినీతి కాటేసింది

అడపా రామకృష్ణ

**ఆ**గమేఘాల మీద, అత్యంత వేగంగా దుమ్ము రేపుకుంటూ, హారన్ మోగించుకుంటూ పోలీస్ జీపు వచ్చి ఆగింది. ఇన్‌స్పెక్టర్, ఐదారుగురు జవాన్లు హడావుడిగా దిగారు. ఆ వెనుక పదిమంది మనుషులతో లారీ వచ్చింది. ఆ వీధిలో తిరిగే వారంతా ఒక్కసారి నిశ్చేష్టులై ఆగి, తదేకంగా అక్కడేం జరుగుతుందో చూడసాగారు.

**ప**రుగు పరుగున పోయే స్కూటర్లు, సైకిళ్లు అన్నింటికీ తక్షణం బ్రేకులు పడ్డాయి. కారులు, బస్సులూ వాటి మానాన అవి పోతూనే ఉన్నాయి. రోడ్డుకి ఇరువైపులా వున్న షాపులు, కిళ్లీ బడ్డీలు, తోపుడు బళ్ల వాళ్లు బేరాన్ని పక్కన పెట్టి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ లాఠీ పట్టుకొని తన పోలీస్ బలగానికి ఆర్డర్లు పాస్ చేస్తున్నాడు.

''ఎవరినీ దగ్గరకు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోండి, ఓ.కే! కేరీయాన్'' అంటూ జవాన్లను హెచ్చరించాడు.

ఆగివున్న లారీ మీద నుంచి పది మంది కూలీలు, ఒక సూపర్‌వైజర్ దిగారు. వారితో పాటు గునపాలు, పారలు, గమేళాలు అన్నీ దించారు.

సూపర్‌వైజర్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ హుషారుగా ముందుకు కదిలారు. ఆ వెనుకే అక్కడున్న అయిదంతస్తుల అపార్ట్‌మెంట్ పైకి పరికరాలతో వెళ్లారు కూలీలంతా తలకు పాగాలు చుట్టి.

''ఊ! ఈ రెండంతస్తుల్ని పుర్తిగా గోడలు, స్తంభాలు, తలుపులు అన్నీ పడగొట్టి కిందికి తోసేయండి'' అని సూపర్‌వైజర్ కూలీ లందరికీ పని పురమాయించాడు. వాళ్లు కూల్చడం మొదలు పెట్టారు. రాటుదేరిన ఒకొక్క సిమ్మెంటు దిమ్మె, ఇటుకల రద్దు, ఇసుక, ఐదంతస్తుల మీది నుంచి రివ్వున కిందకు జారి పడుతున్నాయి. ఆ దుమ్మూ, ధూళీ గాలిలో కలిసి ఆ చుట్టు పక్కల వున్న ఇళ్ల మీద, నిలుచుని చోద్యం చూస్తున్న వారి మీద ఎగిరి పడింది. మూగివున్న జనం కాస్త దూరం దూరంగా కదిలి పోసాగారు. గుమికూడిన వారిలో నుంచి గుసగుసలు మొదలయ్యాయి. అందరికీ వింతగా విడ్డూరంగా తోచింది.

''అయ్యో! అదేంటండీ, అంత చక్కటి బిల్డింగ్ అలా కొట్టి పారేస్తున్నారు?''

''కోర్టు ఆర్డరు అయ్యుంటుంది. పోలీసులు కూడా కాపలా కాస్తున్నారు కదా!''

''ఈ రోజుల్లో ఓ చిన్న ప్రహరీ గోడ కట్టుకోవడానికే సవాలక్ష ఆలోచిస్తాం. అంత డబ్బుపోసి కట్టిన ఇల్లు యిలా కూలదోస్తున్నారంటే మనసెంత ఉసూరు మంటుంది సుమండీ!''

''ఇంతకీ ఆ అపార్ట్‌మెంట్ ఓనర్స్‌కి తెలుసో లేదో?''

''అపార్ట్‌మెంట్స్ కదండీ, రూలు ప్రకారం కట్టాలి మరి. తేడా వస్తే ఊరుకుంటారా? కాంట్రాక్టర్స్ ఎంతసేపూ దోచుకోవడమేగానీ ఇలాంటివన్నీ చూడరు'' అన్నాడు ఒకాయన తన అక్కసు అంతా వెళ్లబుచ్చుతూ.

''డిపార్ట్‌మెంట్ వాళ్లు చాలా స్ట్రిక్ట్‌గా చూస్తున్నారు. అన్నీ కరక్టుగా వుండాలి మరి!'' మరొక ఆసామి వంత పలికాడు.

''మరైతే, నష్టపోయే దెవరు? వోనరా, కాంట్రాక్టరా!'' అనుమానం వెలిబుచ్చాడు మరొకాయన.

''ఎవరైనా నష్టంభరించడటమంటే మాటలా, ఏ నష్టపరిహారమో కట్టించుకొని వదిలేయాలిగానీ, మరీ ఇంత దౌర్జన్యం కూడదండీ!'' అన్నాడు ఒకాయన సానుభూతి చూపిస్తూ.

''బాగా చెప్పారు. అయిదంతస్తుల బిల్డింగ్ ఈ వూరికీ, వీధికే గొప్ప అందం తెచ్చిందనుకున్నా, పాడు చేశారు'' విచారం వ్యక్తం చేశాడు మరొకాయన.

అటూ ఇటూ పహారాకాస్తున్న పోలీసు జవాను విసుగుచెంది -

''వెళ్లండి సార్, వెళ్లండి, ఈ దుమ్మూ ధూళిలో మీకేం పని?'' అంటూ అథార్టీ చెలాయిస్తూ చెప్పాడు. ఒక్కొక్కరూ నెమ్మదిగా కదిలారు.

అప్పుడే రెండుమూడు ఆటోల్లో హడావుడిగా కొంత మంది దిగారు. అప్పటికే మారుతీ వేన్‌లో దిగి, సిగరెట్ ముట్టించుకుని తదేకంగా, పడగొడుతున్న బిల్డింగ్‌వైపు దీనంగా చూస్తున్నాడు కాంట్రాక్టరు. భూకంపం వస్తే ఎలా వుంటుందో అలా కనపడ సాగింది. బిల్డింగ్ ఓనర్స్ అంతా కాంట్రాక్టరు చుట్టూ మూగారు.

పగవాడి దౌష్ట్యంలా కూలగొడుతున్న తన ఇంటిని చూసి తట్టుకోలేక ఒక ముసలాయన కళ్లు తిరిగి పడిపోయాడు.

''అయ్యో! కమలాకరం గారు పడిపోయారు చూడండి'' అని ఒకరు అరవగానే షోడా తెచ్చి ముఖం మీద జల్లారు. మెల్లగా లేవనెత్తి ఆ పక్కనే వున్న మారుతీ వేన్‌లోకే ఎక్కించి పడుకోబెట్టారు.

కమలాకరం ముప్పై మూడేళ్లు సర్వీస్ చేసి రిటైరయ్యాడు. గవర్నమెంట్ క్వార్టర్లో వుండివుండీ విసుగెత్తి వచ్చిన గ్రాట్యుటీతోనైనా సొంత ఇల్లు కనుక్కొని శేష జీవితాన్ని గడపాలనుకున్నాడు. విధి ఇలా వక్రిస్తుందనుకోలేదు.

కాంట్రాక్టరు మీదికి ఒక్కొక్కరు విరుచుకు పడసాగారు - జరుగుతున్న దానికి తట్టుకోలేక.

''మా అమ్మ పోతూపోతూ పొలం అమ్మి డబ్బిచ్చింది- సొంత ఇల్లు కట్టుకోమని. మీరేదో పేరున్న గొప్ప కాంట్రాక్టరని అపార్ట్‌మెంట్‌కి డబ్బు ఇచ్చాను. తీరా గృహ ప్రవేశం వచ్చే సమయానికి కట్టించింది ఇలా పడగొట్టేస్తుంటే, గుండెరాయి

చేసుకుని ఎలా అండీ చూస్తున్నారు? చెప్పండీ...!'' అన్నాడు బాధను తట్టుకోలేక ఒక ఓనరు.

దానికి కాం(ట్రాక్టరు కళ్లు పెద్దవి చేస్తూ -

''మీ సొమ్ము అంతా నేనేదో తినేసినట్లు మాట్లాడతారేమిటండీ... మీ ఫ్లాట్ కన్‌స్ట్రక్ట్ చేశానా, ఏదో బై మిస్టేక్ (ప్రాబ్లమ్ వచ్చింది. ఏది ఏమైనా మీ పోర్షన్ మీకు కట్టిస్తాను, వెయిట్ చేయండి'' అంటూ అరిచినంత పని చేశాడు కాం(ట్రాక్టరు.

''ఏమండీ, నేను వి. ఆర్ తీసుకొని ఆ వచ్చిన డబ్బుతో పిల్ల పెళ్లిచేసి, అపార్ట్‌మెంట్ కూడా తీసుకున్నాను. మా దురదృష్టం మమ్మల్నిలా వెంటాడుతుందనుకోలేదు. ఇప్పుడు మా గతి ఏమిటో చెప్పండి'' అంటూ మరొకాయన కాం(ట్రాక్టర్ని ఆక్షేపించాడు.

''మీరిలా ఒకరొకరు గొడవ చేస్తే నేనేం సమాధానం చెప్పలేను. నష్టపోయేది మీ రొక్కారే కాదుగా, నాకూ చెప్పలేనంత లాస్ వచ్చింది, చూస్తున్నారు కదా!'' సంజాయిషీగా అన్నాడు కాం(ట్రాక్టరు సహనం పాటిస్తూ.

అంతవరకూ ముక్కు మూసుకుని అందరి సంభాషణా ఆలకిస్తున్నాయన, మరిక వుండలేక ముందుకొచ్చి -

''మీరేదో ఫ్లాటు త్వరగా ఏర్పాటు చేస్తానంటే ఆఫీసులో, బ్యాంక్‌లో హౌస్ బిల్డింగ్ లోను తీసి కట్టాను. ఇక్కడ చూస్తే, అంతా రెడీ అయిపోయిందనుకున్న టైంలో మా కళ్లముందే బిల్డింగ్ అంతా కొట్టిపారేస్తున్నారు. కారణం ఏమిటో చెప్పండి. (ప్రాపర్ ప్లాన్ లేకుండా మీరెలా కడతారు? అసలు విషయం చెప్పండి, మీరేదో దాస్తున్నారు'' అని అడిగాడు మరో వోనరు.

ఎవరూ కూడా కాం(ట్రాక్టర్ని మాట్లాడ నివ్వడంలేదు. ఒకరు ఒక పక్కకు లాగితే, మరొకరు మరో పక్కకు తోస్తున్నారు.

''మీ అందరి బాధా నాకు అర్థమవుతోంది. ఆవేశపడిపోయి, మీ ఇష్టం వచ్చినట్లు అర్థంలేని మాటలు మాట్లాడితే జరిగేదేమీ లేదు. నన్ను పూర్తి వివరాలు కనుక్కోనివ్వండి. దయచేసి ఎవరూ ఇరిటేట్ అవ్వకండి. ఇప్పుడు నేను ఆ పనిమీదే వెళ్తున్నాను. అందరూ నా ఆఫీసు రూంకి రండి. అన్ని వివరాలు మాట్లాడుదాం'' అంటూ దూకుడుగా అందర్నీ విడిపించుకుంటూ మారుతీ వేన్ దగ్గరకి వెళ్లి డోర్ తెరిచాడు. అప్పటి వరకూ రెస్ట్ తీసుకుంటున్న కమలాకరం లేచి దిగిపోయాడు. కాం(ట్రాక్టరు (డైవ్ చేసుకుంటూ వెళ్లిపోయాడు.



బాధితులంతా అక్కడే గుమికూడి తమ బాధల్ని ఒకరి కొకరు చెప్పుకొని ఉపశమనం పొంది మళ్లీ అంతా జతకూడి కాం(ట్రాక్టరు ఉండే ఆఫీసు రూంకి వెళ్లారు.

కాం(ట్రాక్టరు ఆఫీసు రూంకి చేరగానే క్లర్కు నమస్కారం చేస్తూ-

''సార్! మీకోసం చాలా మంది ఫోన్ చేశారు, మీతో ఏదో అర్జంటుగా మాట్లాడాలట'' అని చెప్పాడు.

''సరి, సరేలే, ఎవరడిగినా నేను లేనని చెప్పేయ్! ముందు ఆ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ కనెక్ట్ చేయి, మాట్లాడాలి'' అంటూ అతి చిరాకు (ప్రదర్శించాడు.

ఫోన్ కనెక్ట్ చేసి, లైన్లోకి రాగానే- ''సార్, మాట్లాడండి'' అంటూ అందించాడు.

''హలో! ఇన్‌స్పెక్టర్ గారా! నేను కాం(ట్రాక్టర్ని, ఏమిటి సార్, ఇలా జరిగింది. అడగ్గానే పది లక్షలు మామూళ్లు చెల్లిస్తే వందగజాల్లో ఐదంతస్తులు కట్టేసినా ఫరవాలేదన్నారు. ముడుపులన్నీ తీసుకుని పర్మిషన్ ఇచ్చినట్టే ఇచ్చి, కట్టిన బిల్డింగ్ అంతా ఒక్క ఇటిక బెడ్డ మిగలకుండా తవ్వి పారేశారు. ఓనర్స్ అంతా కలిసి నా ఒంట్లో ఎముకలు లేకుండా చిత



## నటించడమే నాక్కావలసింది!

*'**న**టించడమే నాక్కావాల్సింది. అది ఏ భాషా చిత్రమైనా సరే. అందువల్ల భాష రాక పోయినా కష్టంగా ఫీలవడం లేదు' అంటోంది రెండేళ్ళలో దాదాపు 15 సిన్మాల్లో (అదీ దక్షిణాదిన) నటించి తెలుగు తమిళ రంగాల్లో స్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటి సిమ్రాన్. ఏ పాత్రనైనా అవలీలగా చేయగలననే సత్తా, పాజిటివ్ థింకింగ్ ఉంది గనకే నేను సక్సెస్ అవుతున్నా అని అంటోంది ఈ అమ్మడు. అయినా నేటి సిన్మాల్లో నటించడం అంటే అర్థమే వేరు హీరోయిన్లకి. ఫేస్ వాల్యూ (ప్లస్ మిగిలినవి) ఉంటే చాలు. ఇక భాషతో పనేముందిటా?*

గ్గొట్టే టట్లున్నారు. నన్నేం చేయమంటారో చెప్పండి'' అంటూ గబగబా మాట్లాడేసి ముఖానికి పట్టిన ముచ్చెమటల్ని తుడుచుకో సాగాడు. చేతి వేళ్లకున్న నాలుగు వజ్రపు టుంగరాలు- పెట్టుకున్న మనిషికి లేని విలువ మాకెందుకు అని వెక్కిరిస్తున్నట్లు కనిపించాయి.

''చూడండి. ఎన్నో ఒడిదుడుకుల్ని చవిచూసిన మీరే అలా కంగారు పడిపోతే ఎలాగండీ. మీకు అప్పుడే చెప్పాను, పై లెవెల్లో మరో ఫైవ్‌లాక్స్ పంచేస్తే వాళ్లెవరూ నోరు మెదపకుండా వూరుకునే వారు కదా! ఆ తరువాత మీరు గప్‌చుప్‌గా మరో అంతస్తు వేసుకుని పాతిక లక్షలు గడించుకునే వారు. సరేలెండి, అయిందేదో అయిపోయింది. ఆ వచ్చిన వాళ్లకి మీదేమీ తప్పులేదనీ, అంతా ప్లాన్ ప్రకారమే కట్టానని, కింది కోర్టులో కాకపోతే పై కోర్టులోనైనా ఛాలెంజ్ చేస్తాననీ, న్యాయం మన వైపునే ఉందని బాగా నచ్చ జెప్పండి. వాళ్లకి నోరే కాని, గుండె ధైర్యం లేదు. బైది బై, మరో విషయం, మీ రెండో అపార్ట్‌మెంట్‌కి పర్మిషన్ శాంక్షన్ పెట్టాను. సంతకం అయినట్లే. మొదటి దఫా ఆరు లక్షలు ఏర్పాటు చేయండి. మరి వుంటాను'' అంటూ అనునయ వ్యాఖ్యలు పలికి ఫోన్ పెట్టేశాడు అవతలి వ్యక్తి.

కాంట్రాక్టరు ముఖంలోని కండరాలన్నీ రక్తంతో ఉబ్బినట్లయింది. మరో గ్లాసు మంచినీళ్లు గడగడా తాగాడు.

అప్పటికే ఓనర్స్ అంతా వచ్చి కూర్చున్నారు. కాంట్రాక్టరు అందరి వంక ఒకమారు చూశాడు.

''ఇప్పుడే సిటీప్లానర్‌తో మాట్లాడాను, అన్నీ సరిచేస్తా నన్నారు. ఎవరూ వర్రీ పడనవసరం లేదన్నారు. కాంపెన్సేషన్ కూడా వచ్చే ఏర్పాటు చేస్తానన్నారు. కొంచం ఆలస్యం అయినా, మీ ఫ్లాట్స్ అన్నీ పూర్తిచేసి ఎవరిది వారికి అప్పజెపుతాను. జరిగిందానికి నేను చాలా చింతిస్తున్నాను'' అన్నాడు కాంట్రాక్టరు.

తన సానుభూతినంతా మాటల్లో, గొంతుకెలా జీర పోయిందోనన్న తీరులో మాట్లాడుతూ.

''మళ్లీ అప్పుడు కూడా ఇలా జరగదని ఏమిటి గ్యారంటీ?'' ముందరి కాళ్లకి బంధం వేస్తున్నట్లు అడిగారు.

''ముందుగా కోర్టు ఇంజక్షన్ ఆర్డరు తెచ్చే పూచీ నాది'' అన్నాడు కాంట్రాక్టరు తడుముకోకుండా.

''మాకేమీ నమ్మకం లేదండీ. పూర్తిగా కట్టిన బిల్డింగ్ అనికూడా చూడకుండా కూలదోశారంటే ఇందులో ఏదో గూడుపుఠాణీ వుంది. మీరేదో దాస్తున్నారు, చెప్పండి అవునా, కాదా?'' నిలిదీస్తున్నట్లు అడిగాడొకాయన.

''ఆవేశ పడకండి. ఇందులో దాచవలసిన విషయం ఏమీలేదు. టూ బెడ్ రూం ఫ్లాట్ ఒకటి పది లక్షల రేటు ఫిక్స్ చేశాను, అది రెండుకోట్లు ప్రాజెక్ట్. యాభై లక్షల వరకూ అన్ని స్థాయిల వరకూ ముడుపులుగా చెల్లించాను. సెల్లార్ ఆక్రమణ, స్పేస్ పోర్షన్ అన్నింటికీ అనుమతి వచ్చింది. అయితే చవగ్గా ఐదు లక్షలకే ఈ బిల్డింగ్ టేకప్ చేశాను. మీరంతా ఇష్టపడే వచ్చారు. ముందుగానే మీరిచ్చిన అడ్వాన్స్‌లో ఇరవై లక్షలు అందరికీ చదివింపులు జరిగాయి. ప్లాన్‌క్లియరెన్స్, పర్మిషన్ అన్నీ చకచకా వచ్చేశాయి.'' అంటూ కాంట్రాక్టరు విపులంగా అసలు విషయం చెప్పాడు.

అందరూ పరిస్థితిని అర్థం చేసుకుని ఆవేశాన్ని చల్లార్చుకుంటారని అనుకున్నాడు కాంట్రాక్టరు. కానీ ఆతృతతో వచ్చిన వారంతా అటో ఇటో ఏదో తేల్చుకుందామనే ఉద్రేకంతో ఉన్నారు.

''ఇంత బాహాటంగా శృతి మించిన అవినీతి కనిపిస్తుంటే అంతా కళ్లు మూసుకుంటున్నారా, అధికారులంతా ఏం చేస్తున్నారు?'' ఉరుములా విరుచుకు పడుతూ గట్టిగా అడిగారు - ఒక్కసారిగా.

ఆ మాటకి కాంట్రాక్టర్‌కి ఏమీ తోచక నీళ్లు నమల సాగాడు.

''ఏం! చెప్పరేం, మాట్లాడండి'' అన్నారు మళ్లీ.

''ఏం చెప్పమంటారు. అన్నిచోట్లా అవినీతి మర్రి ఊడల్లా పాతుకుపోయింది అన్ని రంగాల్లో బహిరంగంగా. మీకు అందరికీ తెలుసు. మామూళ్ల రూపంలో ఆమ్యామ్యాలు దండుకుంటున్న ఆనవాయితీ ఎన్నో ఏళ్లుగా వుంది. ఎక్కడి కక్కడ వాటాలు పంచుకుంటూ ఎవరిపైనా, ఎటువంటి చర్యలు లేకుండా జాగ్రత్త పడుతుంటారు. అటువంటి లావాదేవీలు, రాత్రి పొద్దుపోయే వరకూ జరుగుతాయి. అదొక పెద్ద సుడిగుండం, చిక్కిపోవడమే గాని, వెనక్కి తిరిగొచ్చే ప్రసక్తి లేదు...'' కాంట్రాక్టర్ మాటలకి అడ్డొస్తూ -

''మేమంతా ఆ అవినీతిని అడ్డుకుంటాం, పట్టుకుంటాం, చట్టానికి అప్పగిస్తాం'' అన్నారు కొందరు మండి పడుతున్నట్లుగా ఉక్రోషంతో.

''అది అంత తేలిక కాదు. అక్కడ ఎవరు సిబ్బందో, ఎవరు ప్రజలో, ఎవరే పనిమీద వచ్చారో, ఎవరు బ్రోకరో, ఏమీ అర్థంకాని రీతిలో బజారులా వుంటుంది. పని కావాలి- అనే తాపత్రయం తప్పించి, డబ్బు పోతుందనే బెంగలేదు ఎవరికీ...''

''అయితే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోలే మంటారా?'' అనుమానాస్పదంగా అడిగారొకరు మధ్యలో.

''హోదా, స్థాయిని బట్టి కాసులు వర్షం కురుస్తున్నప్పుడు, లెఖ్ఖకు మించిన ఆస్థులు, సొంత పేర్ల మీద కన్నా, బినామీ పేర్లమీదకు డైవర్ట్ చేస్తున్నారు. ఎవరూ అంత తేలికగా దొరకరు. ఎవరన్నా చిక్కారంటే అతడు అవినీతి పీకల వరకూ మునిగిన వాడే అయ్యుంటాడు. కావలసిన వాళ్లందరికీ తగినంత చెల్లింపులతో తనకేమీ లెఖ్ఖ లేదన్నట్లు దర్జాగా అందరి ముందే తిరుగుతుంటారు. చిల్లర నోట్లు ఎక్కడ దాచుకోవాలో తెలియక బ్యాంక్ వాళ్లని ఆశ్రయించి కమిషన్ ఎరగా చూపించి ఐదు వందల నోట్లకింద మార్చుకునే వారున్నారు. అవినీతి మూడు మేడలు, ఆరు భవనాలుగా వర్ధిల్లుతోంది. సిబ్బందికి వద్దంటే డబ్బు వచ్చి పడుతోంది. అధికారులు తమ నెల జీతాలు ప్యాకెట్ మనీతో సమానంగా ఖర్చుపెట్టు

కుంటున్నారు. రోజూ బ్రాందీ, విస్కీలు సేవిస్తూ సంతకాలు పెడుతున్నారు....''

అడుగడుక్కీ కాంట్రాక్టర్ మాటల్ని ఖండిస్తూనే ఉన్నారు- అందరూ అతణ్ణి పూర్తిగా మాట్లాడనివ్వక.

''మీరేమో మహా నీతిమంతుల్లా మాట్లాడుతున్నారు. కాంట్రాక్టర్లయిన మీరే, అవకాశం కోసం అడుగడుగునా అవినీతి మప్పి, తెలియని వారికి కూడా నేర్పించి, ప్రోత్సహిస్తూ పుణ్యం కట్టుకుంటున్నారు.

మరొక పక్క కల్తీ సిమెంట్, సముద్రం ఇసుకతో ఏటి ఇసుకను కల్తీ చేసి నాణ్యం లేని ఇటుకలతో అంతస్తు మీద అంతస్తు కడుతున్నారు. ఇదంతా బహిరంగంగా చేస్తున్న అవినీతి కాదా! చెప్పండి! మాట్లాడరేం?'' అంటూ సవాలు విసిరినట్లు అడిగే సరికి కాంట్రాక్టరు బిత్తరపోయాడు ఒక్క నిముషం.

ఆ తరువాత తేరుకుని-

''అవును, ఒప్పుకుంటున్నాను. కానీ అది తప్పని పరిస్థితి. అప్రూవల్ కావాలన్నా, భారీ ఎత్తున ముడుపులు చెల్లించుకోవాలి. కూలీలకు డిమాండ్ బట్టి అడిగినంత వేతనం ఇచ్చుకోవాలి. ఇవన్నీ ఎలా జరుగుతాయనుకున్నారు'' చిక్కు ప్రశ్న వేసినట్లు వేశాడు.


''ఆ డబ్బంతా మేమే కదా ఇస్తున్నాం, ఆ సంగతి గుర్తు తెచ్చుకోండి. మమ్మల్ని పట్టి పీడించి, అధికంగా ఫ్లాటు ధరపెంచి, అవినీతిని, అన్యాయాన్నీ పెంచి పోషిస్తున్నది మీరే కదా.''

''మమ్మల్నే తప్పు పడుతున్నారు. ఈ వ్యవస్థలో అవినీతికి అందరం బాధ్యులమే. మీకేమో అతి కారు చవకగా టూ బెడ్ రూం ఫ్లాటు కావాలి. అది మేము అతి తక్కువ ధరకే కట్టి ఇవ్వాలి. కావలసిన రీతిలో ప్లాన్‌కూడా ఎప్రూవల్ కావాలి. ఇన్ని గొంతెమ్మ కోర్కెలతో, ఎడ్జస్ట్‌మెంట్స్‌తో కావాలంటే అందరూ తప్పుడు తోవ తొక్కవల్సిందే'' అన్నాడు కాంట్రాక్టరు జగమెరిగిన సత్యం పలికినట్లు.

అందరిలో సహనం చచ్చిపోయింది. తమ చోటు వదిలి ముందుకొచ్చి మూగారంతా.

''అన్యాయంగా నష్టపోయింది మేమేగనుక మా ఫ్లాటు విషయంలో ఎవరెవరు, లంచాలు, ముడుపులు తీసుకున్నారో అందర్నీ రేపు మాకు చూపించండి. ఈ దెబ్బతో తెర వెనుక భాగోతం అంతా బట్టబయలు కావాలి'' అని అనగానే అంతా ఆ మాటకు వంత పలికారు.

''పేపరికి ఎక్కిస్తాం, కోర్టుకు వెళతాం,




న్యాయం జరిగే వరకూ నిద్ర పోయేది లేదు'' అంటూ పెద్ద పెట్టున అరిచారు.

కాంట్రాక్టరు ససేమిరా అనవలసి వచ్చింది.

''సరే, మీ ఇష్టం, రేపు డిపార్ట్‌మెంట్‌కి రండి. అందరినీ పేరు పేరునా చూపించి మరీ వెళతాను. మీరేం సాధిస్తారో అది కూడా చూసి వెళతా'' అంటూ అయిష్టంగా లేచి వెళ్లిపోయాడు కాంట్రాక్టరు.

బిల్డింగ్ ఓనర్స్ అంతా ఏకమై, జరిగిన అన్యాయాన్ని ఒక పట్టుదలతో ఎదిరించాలనుకున్నారు.

ఆ మరునాడు స్థానిక దినపత్రికలో ఆ ముందు రోజు జరిగిన సంభాషణ క్లుప్తంగా పడింది. కాంట్రాక్టరు, అధికారుల అవినీతి కుంభకోణం శృంగభంగం చేస్తారన్న వార్త దావానలంలా అంతటా వ్యాపించింది. అయితే ఆ ఇన్‌ఫర్మేషన్ కమలాకరం- కాంట్రాక్టర్ మీదవున్న దుగ్ధతో ఇచ్చి వుంటాడని ఆ క్షణానికి ఎవరికీ తెలియదు.

ఆఫీసు తెరిచే సమయానికి బిల్డింగ్ ఓనర్స్ అంతా ఒకరొకరు ఆవరణలోకి చేరారు. ఆ రోజు పేపర్లో వచ్చిన విషయాలే అంతా పదేపదే చర్చించుకోవడం కనిపించింది. అప్పటికి టైము మూడు గంటలు గిర్రున తిరిగిపోయింది. మిట్ట మధ్యాహ్నం కావచ్చింది. ఎండ తీవ్రంగా ఉంది. ఒక్కొక్కరు ఉక్కకీ, దాహానికీ తట్టుకోలేక విసుగెత్తి పోయారు. కాంట్రాక్టరు ఆచూకీ కనపడలేదు. అందరిలో అనుమానం పొడసూపింది.

'ఇంతవరకూ ఎందుకు రాలేదు, ఎక్కడికెళ్లాడు. ఇక్కడికి రమ్మని చెప్పి, నమ్మించి, మోసం చేసి ఊరు విడిచి పారిపోయాడా? పేపర్లో వచ్చిన బులిటెన్ చదివి బెదిరిపోయి దాగున్నాడా?'

ఆయన ఎక్కడున్నా వెతికి పట్టుకొని, నాలుగు తన్నులు తన్ని, పోలీసులకి అప్పజెప్పాలన్నంత కోపం కట్టలు తెంచుకుంది అందరిలో. ఓపిక, సహనం పూర్తిగా చచ్చిపోయాయి.

అంతా మూకుమ్మడిగా కాంట్రాక్టరు ఆఫీసు రూంకి బయలుదేరారు.

ఏ.సి.రూం తెరిచే వుంది. అద్దాలు మాత్రం వేసి వున్నాయి. లోపలి వారికి పైనున్న వారు కనిపిస్తారు. కానీ పై నున్న వారికి లోపల ఏమీ కనిపించదు.

అందరూ దొమ్మీగా ఏ.సీ.రూం అద్దాల్ని బలంగా తోసుకుంటూ లోనికి ప్రవేశించారు. భయంకరమైన, హృదయ విదారకమైన దృశ్యం కళ్ల బడింది. రక్తపు మడుగుల్లో తేలి వున్నాడు కాంట్రాక్టరు. కళ్ళు తేలేసి ఒక పక్కకు కుర్చీలో వేలబడి వున్నాడు. ఎవరో హత్య చేశారు. అందరి గుండెలు జలదరించాయి. నిశ్చేష్టులయ్యారు.

వెనువెంటనే పోలీసు సిబ్బంది రంగ ప్రవేశం చేశారు.

అవినీతికి ఊపిరి పోసిన కాంట్రాక్టరును అదే అవినీతి తిరిగి కాటేసింది. దిక్కుతోచని స్థితిలో అవినీతి పడగ నీడలో బిల్డింగ్ ఓనర్స్ అంతా బిక్కచచ్చి చేష్టలుడిగి చతికిల పడిపోయారు.